గేటు తీసిన శబ్దం-స్కూటర్ దగ్గరౌతున్న అనుభూతి సరోజ గుండె వేగాన్ని విపరీతంగా పెంచింది. ఎప్పటి లాగే కర్టెన్ తొలగించి ఆత్రంగా చూసింది. బ్లాకలర్ స్కూటర్ దూసుకువచ్చి పోర్టికోలో ఆగటం కన్పించింది.

తన కిష్టమైన నల్లపాంటూ, తెల్ల షర్టూ వేళ్ళ మధ్య వెలుగుతున్న సిగరెట్టూ చేతిలో ఫైలూ

# ఇదీ న్యాయం

## డా॥ కె.వి. కృష్ణకుమారి

సరోజ కళ్ళల్లో అనిర్వచనీయమైన ఆనందం తృప్తి కన్పించాయి. తనకి ప్రాణాధికమైన వ్యక్తిని సన్నిహితంగా లేకపోయినా, కనీసం ఎన్నోరోజుల తరువాత దూరం నుంచైనా చూడబోతున్నానన్న భావం తియ్యని అనుభూతితో గుండె నిండుగా స్పందించింది.

అప్రయత్నంగా అద్దం ముందు నిలబడ్డ సరోజకి తన రూపం తనకే అస్పష్టంగా కన్పించింది.

పాలరాతి శిల్పానికి అంటిపెట్టుకున్నట్టున్న పాల నురుగు లాంటి చీరె పాము కుబుసంలా, శరీరాన్ని అంటుకున్న అనుభూతి.

తన ఊహల్ని వెక్కిరిస్తున్నట్టన్పించింది 'ఒక్కక్షణం తన అశాంతకు ఆమోద ముద్ర పడలేని ప్రస్తుత స్థితి గుండెల్ని పిండినట్టన్పించింది.

ఎప్పటిలాగానే-

డ్రాయింగ్ రూంలోకి వెళ్ళబోతున్న శేఖర్ క్షణం ఆగాడు. తన కెంతో ఇష్టమైన మంచిగంధపు వాసన తెరలు తెరల్లా ముట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చెయ్యటం కోరుకున్న అనుభూతి. కోరుకునే అనుభూతి.

చిరుగడ్డం దప్పుడు క్షణాల మీద దూరమవటం గమనించి తృప్తిగా నవ్వుకున్నాడు.

"హల్లో శేఖర్.. చాలా లేటైందా వచ్చి-"

సుజాతకు సమాధానం శేఖర్ పెదాల మీద కన్పించింది.

తను అప్పుడే వచ్చినట్టు తెలిసినా చాలా సేపట్నుంచి తన కోసం ఎదురు చూస్తున్నట్టు తను అనుకోటం - తన వేళ అన్పించటం ఆవిడకు ఆనందంతో కూడిన అలవాటు.

ఆవిడ అలవాటును విస్మరించలేని బలహీనత తనకలవాటైందేమో.

"మీరివాళ తప్పకుండా వస్తారని నాకు తెలుసు"

కావాలని ముద్దుగా మాట్లాడుతున్నా దాగని పెద్ద వయసూ, వయసు పదేళ్ళు తగ్గినట్టు కన్పించాలనే తాపత్రయంతో ప్రత్యేకంగా చేసుకున్న అలంకరణ- సుజాత వ్యక్తిత్వాన్ని తగ్గించినట్టు కన్పిస్తున్నా, అభిమాన రచయితగా ఆమె తనమీద పెంచుకున్న అభిమానం, అనుబంధం శేఖర్ మనసులో మంచి భావానికి స్పష్టమైన రూపాన్నివ్వలేక పోయింది.

"నేనెప్పుడూ చెప్పాను. మీకు టెలీపతిలాంటి దేదో వుండి వుంటుందని" శేఖర్ సమాధానంగా సుజాత నవ్వులో అతిశయం కూడా కన్పించింది.

శేఖర్ పెదాంమీద చిరునవ్వు వెలిగింది. క్షణం ఆలోచనకు తావిచ్చిందది.

తను చెప్పేది అబద్ధమని తెలుసు. వారం క్రితమే తనరోజు వస్తున్నట్టు ఫోన్ చేశాడు కూడా. ఐనా ఆవిడ ఆనందం కోసం తృప్తి కోసం తనెందుకింతగా ప్రాకులాడుతున్నాడు? అబద్ధమైనా అందంగా మంచి చెప్తే ఆవిడలో మరింత అందమైన సంతృప్తి కన్పిస్తుంది.

అందువల్ల తనకొచ్చే లాభం?

నిజాన్ని నిర్దయంగా చెప్తే ఆవిడ చిన్నబుచ్చుకోవచ్చు. అందువల్ల తన కొచ్చే నష్టం?

ఒక అభిమాని ప్రభావం తనలాంటి వారి మీద కూడా ఇంత బలీయంగా వుంటుందా? మనస్తత్వవేత్తల మస్తిష్కాలనే మథించే సామర్థ్యం వుందన్పించుకున్న తనలాంటి రచయిత మనస్తత్వాన్నే బలహీన పరచ గలుగుతోందా?

అభిమానానికీ ప్రతిస్పందనకీ ఎంత సన్నిహితత్వం వుంది.

సుజాత భర్త పేరు ప్రఖ్యాతులున్న పెద్ద సర్జన్. మంచికీ మానవత్వానికీ విలువనిచ్చే మనసున్న మనిషి. తన వృత్తిలోనూ ప్రతీ వ్యక్తిలోనూ దైవాన్ని చూడటానికి అలవాటు పడ్డ వ్యక్తి.


తన వృత్తే జీవిత సర్వస్వమనుకుంటున్న అతని జీవితంలోకి అగర్భ శ్రీమంతురాలైన సుజాత కోరి మరీ వచ్చింది. ఆ విధంగా కూడా డాక్టర్ రవి స్థానం సమాజపరంగా మరో మెట్టు పైకి అధిగమించినట్టన్పించినా ఆ విధమైన ఉన్నతిని ఏనాడూ కోరని రవి తన ప్రత్యేకతనూ, గౌరవాన్ని నిలుపుకునే విధంగా తనకంటూ ఒక ప్రత్యేక లోకాన్ని సృష్టించుకున్నాడు. ఆ లోకం రోగులకే పరిమితం. ఆ తృప్తీ, ఆనందం, ఉన్నతీ ఒక్క తన మనసుకే పరిమితం.

ఆ లోకంలోకి పొరపాటున కూడా అడుగుపెట్టదు సుజాత. ఆవిడ ఎరిగిన లోకం వేరు. ఆ వాతావరణం వేరు. ఆ మనస్తత్వాలు వేరు. పేదలన్నా, రోగులన్నా సుజాతకి ఏవగింపు. ఐతే వాళ్ళు నిర్భాగ్యులనీ, వాళ్ళకు నిర్విరామంగా సేవ చెయ్యగల ఓర్పు నేర్పు తన భర్తకున్నట్టు అందరికీ వుండవనీ, భర్త శ్రమదానం వూరికే పోదనీ దాని తాలూకు ప్రతిఫలం భర్త పేరు ప్రతిష్ఠలనీ మహిళా మండలిలో తన గుర్తింపునూ మరింత పెంచుతుందని పెద్ద నమ్మకం. ఆ నమ్మకాన్ని నిజం చేసు

కోడం కోసం కూడా భర్తకు అడ్డురాదల్చుకోలేదు.

క్షణం కూడా విరామంలేని భర్తకు తన అందచందాలనీ గంటల కొద్దీ చేసుకున్న అలంకరణల్నీ విసుగు లేకుండా చెప్పే తన కబుర్లనీ వినే తీరికా, ఓపికా లేవని బాగా తెల్సు సుజాతకి. ఏ అర్ధరాత్రో అలసి ఇంటికి వచ్చే భర్త సరసన మౌనంగా ఒదిగి పడుకోటం, విశ్రాంతిగా నిద్రపోయే భర్త గుండెల మీద తల వాల్చుకుని తనలో మిగిలిపోయిన అసంతృప్తిని తీర్చుకోటానికి మరిన్ని దారులు ఆలోచిస్తూ ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపేది. ఆ ఆలోచన్లు కూడా మరింత తృప్తి నిచ్చేది సుజాతకు.

కారణం ఆ అమాయకురాలికి భార్యాభర్తల బంధం ఎంత బలవత్తరమైనదో తెలియదు. క్షణకాలం ఎడబాటు కూడా ఎంత మానసిక సంక్షోభాన్ని కల్గిస్తుందో



తెలీదు. ఆత్మీయతతో ఆప్యాయతతో భర్త దగ్గరకు చేరి భర్త చేత లాలింపబడటంలో వున్న తియ్యదనం తెలీదు.

తెల్సివుంటే డాక్టర్ రవి కొంత కాలాన్నైనా ఇంటికోసం ఇల్లాలికోసం ఖర్చు చేసేవాడేమో

సుజాతలో వున్న అసంతృప్తి అందరి చేతా పొగిడిపించుకుని పొందే అతిశయం అర్థంలేని ఆత్మ సంతృప్తి తొంగివుండేవేమో.

ఐతే డబ్బుందన్న అహంతోబాటు మంచి పాఠకురాలిగా ఉత్తమ సాహిత్యాన్ని వంటబట్టించుకునే సంస్కారవంతురాలిగా కూడా గుర్తింపు పొందాలనే తహతహ సుజాతలో అంతర్లీనమై వుంది. ఆ కోరికను వెలికి తీసింది సుజాత ఆడబడుచు సరోజ.

సరోజ డాక్టర్ రవికి ఒక్కగానొక్క చెల్లెలు. తగిన కట్నం ఇచ్చుకోలేని అసహాయతకు, కొంతకాలం అత్తగారింట్లో నరకాన్ని చూపింది. ఆ తరువాత విధి సరోజ ఐదోతనాన్ని చెరిపివెయ్యటం జరిగింది. పదిహేడేళ్ళు రాకుండానే విధవగా పుట్టింటికీ ఆ తరువాత అన్న పంచకు రావటం జరిగింది.

పరిస్థితులు సరోజ మనసును పెంచాయి, ఆలోచనల్ను పెంచాయి. సహజంగా వున్న ఆత్మ సంస్కారానికి మెరుగులు పెట్టాయి. ఇంటి పట్టున వుండని వదిన బాధ్యతల్ని క్షణం తీరిక లేకుండా నిర్వహిస్తూనే ఏ మాత్రం తీరిక దొరికినా మంచి పుస్తకాలనూ ఉత్తమ సాహిత్యాన్నీ వదిలేది కాదు సరోజ.

సరోజ ద్వారానే శేఖర్ ఉత్తమ రచయితగా ఉన్నత భావాలుగల ఆదర్శ వ్యక్తిగా సాహితీ పుటల ద్వారా మాత్రమే సుజాతకు పరిచయం కలిగింది. ఆ పరిచయం

# హొసరేఖ

తరతరాలుగా నరజాతి చరితలోన
కాంతికిని, చీకటికిని సంగ్రామ రంగ
మైన వసుధాస్థలిని దివమందు కాంతి
రాత్రమందున చీకటుల్ రాజ్యమేలు!

పొడుపు దిక్పతి కాన్పులో బుట్టి బాల
భాస్కరుడు వెండి ఖడ్గాలు పట్టి త్రిప్పి
తిమిర సంహారమొనరించి దినదినంబు
కాంతి వర్షించుచుండు లోకంబునందు!

అలసి చండభానుడు పశ్చిమాంబునిధిని
క్రుంకులిడబోయినంత సంకోచమింత
లేక, చీకటి లేచి బలీయమైన
ముసుగులోపల జగతిని ముంచివేయు!

పగటిపూట క్రొంజీకటుల్ పారిపోవు
వెలుగు, యామినిలో వెల వెలలు పోవు
ఈ పరస్పర విజిగీషయే సతంబు
కాలగమనంబునకు ముఖ్యకారణంబు!

అయిన నేమాయె? నమవసయందు నేడు
నిండుపున్నమి వెన్నెలల్ నిలిచిపోయె
ప్రాకె చీకటి మోమున శోకరేఖ
అమరె కాంతి ముఖంబున హొసరేఖ!

—ఎం.పి. జానుకవి

అభిమానంగా మారింది.

ఆ అభిమానం శేఖర్‌ని వెతుక్కుంటూ వెళ్ళింది. తమ మహిళా మండలి ద్వారానే అతనికి తన చేతులమీదుగా పెద్ద ఎత్తున సన్మానం చేసింది. సరోజ ద్వారా తెల్సుకున్న అతని సాహిత్యం గురించీ సంస్కారం గురించీ సహజమైన వాగ్ధాటితో అనర్గళంగా ఉపన్యసించి శేఖర్‌ని ఆకట్టుకోటంతో బాటు ఒక చక్కని సాహితీ బంధువుగా ప్రముఖ విమర్శకురాలిగా ఆనాటి సభలో ప్రత్యేక గుర్తింపు అందుకుంది.

ప్రముఖ రచయిత శేఖర్ సుజాత అభిమానానికీ, తన రచనల మీద ఆవిడ చేసిన సహేతుకమైన చక్కని సాహితీ విమర్శకీ కట్టుబడిపోయాడు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ రవి ధర్మపత్నిగా తెల్సుకుని ఆవిడ మీద మరింత గౌరవాన్ని పెంచుకున్నాడు.

తన అభిమానులందరిలోకీ ప్రత్యేక స్థానం సుజాతకిచ్చాడు. సుజాత కోరిక ప్రకార వారంలో ఒక్క పూట తప్పని సరిగా ఎన్ని పన్లున్నా మానుకుని ఆవిడకి అతిథిగా వెళ్ళటం తన కార్యక్రమంలో ఒక భాగంగా అనుకున్నాడు.

ఐతే సామాన్యంగా చూసేవారికి దూరపు కొండలు నునుపుగానే వుంటాయి ఆహ్లాదంగానే కన్పిస్తాయి. తార్కిక దృష్టి వున్న వారికే ఆ దూరం మరింత దగ్గరై మస్తిష్కానికి మరింత పదును పెడుతుంది.

దూరంలో అతి సామాన్యంగా కన్పించే మొక్కల్లో వెతికితే-వెతికే విలువను గ్రహించగల శక్తే వుంటే అమూల్య మూలికలూ, అపురూప ఔషధులూ కన్పించకుండా పోవు. వాటి విలువ- విలువ తెల్సిన మనిషిని ప్రగాఢంగా ఆకట్టుకోకుండా వుండవు.

శేఖర్ విషయంలో అదే జరిగింది.

శేఖర్ పుట్టిన రోజున అతని విమర్శనాత్మక గ్రంథం 'ఏది న్యాయం' వెలువడింది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని అభిమానులు పెద్ద ఎత్తున అభినందన కార్యక్రమం తలపెట్టారు. ఆ రోజునే ప్రత్యేకంగా సుజాత మధ్యాహ్నం భోజనానికి పిల్చింది శేఖర్‌ని. అభినందనకు ముందుగా తన ప్రత్యేక అభినందన వుండాలన్నది సుజాత కోరిక.

ఆ రోజే ఆ ఇంట్లో ఒక ప్రత్యేక వ్యక్తిని మొదటి సారిగా గమనించాడు శేఖర్. దంతపు బొమ్మలా ముత్యాల రెమ్మలా సన్నజాజి మొగ్గలా కన్పించీ కన్పించకుండానే తన ప్రత్యేకతనూ ప్రాముఖ్యతనూ ఆ రోజున చెప్పకుండానే అదృశ్యంగానే అర్థమయేటట్టు ప్రవర్తించిన ఆ అందాల బొమ్మలో ఊహించలేనంతటి ప్రత్యేకతను అంచనాలు వేస్తుండిపోయాడు శేఖర్.

బంగారపు పూత పూసిన ముచ్చటైన సిగరెట్ కేస్- లైటర్, ఖరీదైన పెన్‌సెట్ తన ప్రత్యేక బహుమతిగా అందజేసింది సుజాత. మహిళా మండలి అభినందన పరంపరతో ఉక్కిరి బిక్కిరి చేసింది..

శేఖర్ కళ్ళు దంతం బొమ్మకోసం తెరల చాటునా గుమ్మం దాపునా వెతుకుతునే వున్నాయి.

క్షణాల్లో కన్పించి మాయమైన ఆ అందమైన కళ్ళల్లోని విపరీతమైన ఆరాధనని, అంతకు మించిన పవిత్ర భావం శేఖర్ మనసులో అలజడి రేపింది.


అజ్ఞాతంగా తననింతగా ఆరాధిస్తున్న ఆ అమ్మాయి ఎవరు?

ఒకే చూపులో తన మీదున్న అభిమానాన్నంతా వ్యక్తం చెయ్యగలిగిన ఆ అందాల బొమ్మ ఎవరు?

నిరాడంబరంగా మంచుతో తడిసిన తెల్ల గులాబీలా కడిగిన ముత్యంలా తనూ నన్నభినందించాలన్న ఆత్రం, అందరి ముందూ బయటపడలేని నిస్సహాయతా.

ఎందుకలా!!!

అందరిలా స్వేచ్ఛగా నిర్భయంగా తిరగలేని ఆ బందిఖానా, ఆ బెదురూ



ఎందుకని. అసలీ ఇంట్లో ఆవిడ స్థానం ఏమిటి?

ఎటువంటిది???

సుజాత అతిథుల్ని పంపించే హడావిడిలో వుంది

మంచి గంధపు వాసన దగ్గరౌతున్న అనుభూతి

తను ఎదురుచూస్తున్న బొమ్మ రావటం తన చేతికి అందమైన బైండింగ్ బుక్ అందించి మాయమవటం క్షణాల మీద జరిగింది.

ఉత్కంఠ నాపుకోలేక పేజీ తిప్పాడు.

"ఈ సంతోష సమయంలో నాకు వస్తురూపంగా ఏదైనా బహుమతి నందించాలన్పించింది. నా దృష్టిలో మీలాంటి వారికి ఇంతకు మించిన కానుక వుండదని కూడా అన్పించింది. వదిన దగ్గర 'ఏది న్యాయం' చదివాను. నేను తెలియక పోయినా నన్నే దృష్టిలో పెట్టుకుని వ్రాశారన్పించింది. మీ వంటివారు ముగింపును 'ఏది న్యాయం' అంటూ పాఠకులకే వదలకూడదు. 'ఇదీ న్యాయం' అంటూ పరిష్కారాన్ని చూపించాలి.ఏమైనా కథనం నడిపించిన తీరు అత్యద్భుతం. మీరు వ్రాసిన అన్ని పుస్తకాలూ ఒక ఎత్తూ ఇదొక్కటీ ఒక ఎత్తూ. మీ పుస్తకాలన్నీ విడవకుండా చదివి నేను ప్రతీ పుస్తకం మీదా సహేతుకంగా నాకు తెల్సినట్టు చేతనైనట్టు సమీక్షలు వ్రాశాను. స్వీకరించండి -సరోజ.

శేఖర్ ఆత్రంగా పుస్తకం తిరగేశాడు. ముత్యాల సరాల్లాంటి అక్షరాల్లో సరోజ హృదయం ప్రతిఫలిస్తోంది. విలక్షణ శైలితో విమర్శనాత్మకమైన విమర్శలూ సమీక్షలూ విపులంగా వున్నాయి. శేఖర్ కళ్ళు మెరిశాయి.

తనలాంటి రచయితకు ఇంతకు మించిన విలువైన కానుక వుంటుందా?

అప్రయత్నంగా పుస్తకాన్ని గుండెల కానించాడు.

బరువైన అడుగులు బరువుగా కదలటం గమనించాడు.

తన రచనల్ని మించిన ఉన్నత స్థాయిలో వున్నాయా సమీక్షలు. తన హృదయాన్నంతా పూర్తిగా చదివినట్టు వ్రాసిన ఆ అక్షరాక్షరంలో సరోజ హృదయమే కన్పిస్తోంది. ఒక్క విమర్శ చాలు తన పొరపాట్లను సరిదిద్దుకోటానికి. ఒక్క పొగడ్తచాలు తన ఆత్మ విశ్వాసాన్ని పెంచటానికి. ఒక్క సూచన చాలు తన కలాన్ని విమర్శనాత్మకంగా ముందుకు నడిపించటానికి.

శేఖర్ తనకు తెలియకుండానే సరోజ మీద ఆరాధన పెంచుకున్నాడు.

సుజాత ఇంటికి తరచుగా వెళ్ళటం, సరోజని చూసి మాట్లాడి తన కృతజ్ఞతనూ అభిమానాన్నీ తెలియజెయ్యాలనే ఆరాటం శేఖర్‌లో ఎక్కువైనా, కంటికి కన్పించని సరోజను గురించి సుజాతను ఏమని అడగాలో ఏ రకంగా ఆవిడ విషయం ప్రస్తావించాలో అర్థం కాలేదు మొదట. ఐనా మనసు ఊరుకోలేదు.

సుజాత మొహం పాలిపోయింది సరోజ ప్రస్తావనతోనే. తృప్తిగా వెలిగి పోతున్న శేఖర్ని కొత్తగా చూసింది. విస్మయంగా చూసింది.

సరోజ విమర్శనాత్మక గ్రంథం చదివాక ఆవిడ మానసికంగా తనకెంత సన్నిహితురాలో అర్థం చేసుకున్న శేఖర్, సుజాత మనస్తత్వం తెల్సుండీ ఇంతకాలం ఆలశ్యం చేసినా సుజాత ద్వారా సరోజను గురించిన కామెంట్లు ఎంత ఈర్ష్యతో కూడుకున్నవో గ్రహించినా ఈ రోజు సరోజతో మాట్లాడి తీరాలనే నిర్ణయాని కొచ్చాడు.

సరోజ విషయంలో శేఖర్ చూపెస్తున్న శ్రద్ధ సుజాతలో కూడా విశేషమైన మార్పు తీసుకు వచ్చింది. ఏ విధంగానూ తనతో సరితూగని సరోజ, శేఖర్‌ని ఎందుకింతగా ఆకర్షించింది? అసలు వారిద్దరూ ఎప్పుడు కల్సుకున్నారు? ఎప్పుడు మాట్లాడుకున్నారు? ఎప్పుడూ వంటింట్లోనే వుండే సరోజ తననుకున్నంత అమాయకురాలు కాదన్నమాట. తను కాకుండా శేఖర్‌తో..- ఈర్ష్యతో ఇంక ఆలోచించ లేకపోయింది సుజాత. శేఖర్ మీద మరో ఉద్దేశం తనకు లేకపోయినా అతన్ని ఎంతగానో అభిమానించింది. ఆ తరువాత ఆరాధించింది. అతని సంస్కారానికి తలవంచింది. ఒక మంచి స్నేహితుడిగా అతని సహచర్యంలో తన మనసునే ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలనే తాపత్రయంలో అతనికి మరింత సన్నిహితురాలైంది. తన అందం మీదా ఆరోగ్యం మీదా శ్రద్ధను పెంచుకుంది. శేఖర్ కోసం ఎదురుచూడటం కూడా తన జీవితంలో ఒక భాగమైపోయింది.

ఈ పరిస్థితుల్లో శేఖర్ సరోజను గురించి గుచ్చి గుచ్చి అడగటం సుజాత వ్యక్తిత్వం మీదే గొడ్డలి పెట్టులా తగిలింది.



తనని శేఖర్ విపరీతంగా అభిమానిస్తున్నాడు. గౌరవిస్తున్నాడు. తన మనసుకు బాధ కలిగితే భరించలేడు. ఈ నిజం తనకు తెలుసు. ఇప్పుడే...ఇప్పుడే సరోజ గురించి చెప్పి...

తీవ్రంగా ఆలోచిస్తున్న సుజాతను ఆప్యాయంగా చూశాడు శేఖర్.

"ఏమిటంతగా ఆలోచిస్తున్నారు? బెలీపతీ గురించా...?"

"సరోజ గురించి"

ఉలిక్కిపడి చూశాడు శేఖర్. సుజాతను చదువుతున్నట్టు పరిశీలనగా చూశాడు. ఆవిడ పెదాలు అదురుతున్నాయి. పంటి బిగువున భావాలు నలిగిపోతున్నాయి. కంటి చివర్న కసి కన్పిస్తోంది.

శేఖర్‌కి తమాషాగా అన్పించింది. ఎందుకో ఉడికించాలనీ అన్పించింది.

"నన్ను చూస్తుంటే మీకు సరోజెందుకు గుర్తుకు వస్తోంది?"

"అదే తెలియటం లేదు. అసలలా గుర్తు రాకూడదు కూడా..." ఆవేశం లాంటిదేదో సుజాతలో ఉప్పెనలా తన్నుకొచ్చింది.

"...చిన్నతనంలోనే దానికి మొగుడు పోయాడు.నిప్పులాంటి సాంప్రదాయం మాది. కంచుకోటలాంటి ఈ ఇంట్లో- ఎటువంటి వాళ్ళకైనా రక్షణ లభిస్తుంది... కానీ-అడ్డమైన పుస్తకాలూ చదివి సరోజ ఈ మధ్య పూర్తిగా మారిపోతోంది. విధవకు పూలు నిషిద్ధం. మా ఇళ్ళల్లో రంగు చీరలు నిషిద్ధం. అసలు భర్తను గురించిన తలపు తప్ప మరో వెడు తలపులు వుండటానికే వీల్లేదు. ఆ తలపు లొచ్చాయా-ప్రాణత్యాగం చేసుకోవాలంతే. ఈ ఇల్లు-సాంప్రదాయం- అటు వంటివి. ఆ అన్నకు ఇల్లు పట్టదు. ఈ మనిషి ఎప్పుడేమి తెగిస్తుందోనని భయంగా వుంది.

సుజాతలో ఇంత ఆవేశం-ఈర్ష్యా మొదటిసారిగా చూస్తూన్న శేఖర్‌కు సుజాత ఏమిటో అర్థమైంది.

"పుస్తకాలు చదవచ్చు కాదనను. కానీ స్త్రీకి అందులో మొగుడు పోయిన దానికి మరో ఆలోచన్లు వుండకూడదు. దాని మాటలూ పోకడలూ విపరీతంగా అన్పిస్తున్నాయి. పెద్దదాన్ని వదినను కదా...మొన్న నాతోనే సెక్సు గురించిన టాపిక్ మొదలు పెట్టింది. నాకు అసహ్యం వేసింది. మా అన్నయ్య భార్య అన్నయ్య పోయాక మఠంలో కల్సి పవిత్రంగా బతుకుతోంది."

"... ... ... & ...'

మీకే చెప్తున్నాను ... ..."

రెట్టిస్తున్న సుజాతని తమాషాగా చూశాడు శేఖర్.

"అదే నా కెందుకు చెప్తున్నారో అర్థం కావటం లేదు..."

ఎందుకో చెప్పలేకపోయింది సుజాత. కానీ ఏదో చెప్పాలని వుంది- ఎంతైనా చెప్పాలని వుంది. ఈ ఆవేశం తనకే కొత్తగా వుంది.

"మనిషన్న తరువాత నీతికీ నిజాయితీకీ నిలబడి వుండాలి... ఏమిటో సరోజ స్థితి అర్థం కాకుండా పోతోంది. ముళ్ళ కంచె మీద బట్ట ఆరేసినట్టు...-?"

సంస్కారం చాటున అతి కష్టం మీద అంటుంది కానీ సంస్కారపు ముసుగు తీసేస్తే సరోజను గురించి ఎన్ని బూతులైనా మాట్లాడగలదని అర్థమైంది శేఖర్‌కి.

సరోజ హృదయాన్ని పూర్తిగా చదివాడు తను. అజ్ఞాతంగానే తనకతిదగ్గరైన ఆ అమాయకురాల్ని గురించిన విమర్శలు చాలా ఇబ్బందిని కలిగించాయి. కావాలనే సరోజను గురించి ఎన్నో సార్లు అడిగి సుజాత రియాక్షన్ చూసిన శేఖర్ ఆలోచనలో పడ్డాడు.



** ** **

క్లబ్ నుంచి హడావుడిగా వస్తూ టైం చూసుకుంది సుజాత. "అరే ఆరైపోయింది... శేఖర్ ఏదో ముఖ్య విషయం చెప్పాలన్నాడు... అతనిచ్చిన టైమ్‌కి కూడా దాటిపోయింది...

పోర్టికోలో భర్త కారుండటం చూసి కనుబొమ్మలు ముళ్ళు పడ్డాయి. ఈ టైమ్‌లో ఈయనా?... అన్‌యూజ్వల్-"

తమాషాగా బుజాలెగరేస్తూ హాల్లోకి అడుగు పెట్టిన సుజాత స్థాణువైపోయింది.

శేఖర్, సరోజలు దంపతులుగా తన భర్త కాళ్ళకు నమస్కరిస్తున్నారు!

"హల్లో సుజా... చూశావా ...మన సరూ ఎంత అదృష్టవంతురాలో... ప్రాతల్ని చేతల్లో పెట్టగల ఇటువంటి భర్త లభించటం సరూ అదృష్టం..."

ప్రపంచాన్ని జయించినంత ఆనందం భర్తలో మొదటిసారిగా చూసింది.

"...సారీ సుజాతగారూ-సర్‌ప్రైజ్ చేద్దామని ముందుగా మీతో చెప్పలేదు. సస్పెన్స్ నాకు అలవాటుకదా... సరోజలాంటి దేవ పారిజాతం నాకు సకాలంలో అందటం నా అదృష్టం. పెద్దవారు ఆశీర్వదించండి."

శేఖర్ కళ్ళల్లో అర్థం చేసుకోలేని భావాలు...

అర్థంకాని భావాలు...

తనకే అర్థమయ్యే...

ఇంకా చలనం లేనట్టు చూస్తూనే వుంది సుజాత.


నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి!



చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి!

హస్తప్రయోగము వలన కలుగు నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మ వ్యాధులకు అద్భుత చికిత్స!

పోస్టు ద్వారా చికిత్స కలదు!

క్యాంపులు: ప్రతి ఆదివారం "భీమవరం" షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గం. నుండి సాయంత్రం 6-30 గం.వరకు

ప్రతి నెల 1 మరియు 16 తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు

# డా. డి.మార్కండేయులు

ఆయుర్వేద భిషక్, సెక్సు & స్కిన్ స్పెషలిస్ట్

పార్కు రోడ్, గుడివాడ—521 301

ఫోన్స్: 522 & 540